నేడు వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్‌, ఆల్విన్‌ కాలనీ డివిజన్‌, ఎల్లమ్మబండ, అంబేడ్కర్‌నగర్‌ బస్టాప్‌ ప్రాంతంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు వాల్మీకి మహర్షి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బోయి కిషన్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

మరమ్మతుల పరిశీలన


డ్రైనేజీ మరమ్మతులను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్‌ విలియం ప్రకాష్‌

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌, వి. రామారావునగర్‌లో డ్రైనేజీ మరమ్మతులను శనివారం మూసాపేట జలమండలి మేనేజర్‌ విలియం ప్రకాష్‌ పరిశీలించారు. శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా మురుగునీరు, మంచినీరు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్‌ శివ, బీఆర్‌ఎస్‌ బీసీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం గంగపుత్ర పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన పాస్టర్స్‌ ఫెలోషిప్‌ నూతన కార్యవర్గం

బాలానగర్‌: బాలానగర్‌ పాస్టర్స్‌ ఫెలోషిప్‌ నూతన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శనివారం బాలానగర్‌ కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డిని కలిశారు. వారిని కార్పొరేటర్‌ సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె. విజయబాబు, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి జి. దినకర్‌ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


మౌనిక

చందానగర్‌ : ఓ మహిళ అదృశ్యమైన ఘటన చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చందానగర్‌ పాపిరెడ్డి కాలనీ చెందిన మౌనిక (26) గచ్చిబౌలిలో ప్రైవేట్‌ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి రాత్రైనా రాలేదు. భర్త సాయివెంకట్‌ గౌడ్‌ మౌనికకు ఫోన్‌ చేయగా బస్సులో వస్తున్నానని తెలిపింది. ఎంత సేపటికీ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటి వృథా.. తప్పదు వ్యథ!

అసలే వేసవికాలం ప్రారంభం. ఎండలు మండుతున్నాయి.. దీంతో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి తప్పడం లేదు. నగరంలోని ప్రజలు నిత్యం గుక్కెడు మంచినీటి కోసం తల్లడిల్లుతున్నారు. ఏ పూటకాపూట నీళ్లు తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. ప్రజల దాహార్తిని తీర్చటం కోసం సుదూర ప్రాంతాల నుంచి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి నగరానికి నీటిని తీసుకువచ్చి శుద్ధి చేసి తాగు నీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇలాంటి పరిస్థితిలో నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలి. అనవసరాలకు ఉపయోగిస్తే వ్యథలు తప్పవు.

ఆల్విన్‌కాలనీ

రిక్షాపుల్లర్స్‌ కాలనీలో వృథాగా తాగునీరు


రోడ్డుపై పారుతున్న నీరు

కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని వివేకానందనగర్‌ డివిజన్‌ రిక్షాపుల్లర్స్‌ కాలనీలో తాగునీటి విలువ తెలియక కొందరు అదే పనిగా నీటిని వృథాగా రోడ్లపాలు చేస్తున్నారు. ఇంటిలో కావల్సిన మంచి నీరు నిల్వ చేసుకున్న తరువాత మిగిలిన నీటిని వాహనాలు కడగటం, ఇళ్లు శుభ్రం చేసుకోవటం, ముందు ఉన్న రోడ్లపై నీటిని వృథాగా వదిలేయడం వంటివి చేస్తున్నారు. ఇది కొందరు ప్రశ్నిస్తే వారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారు. అవసరానికి నీటిని పట్టుకున్న తర్వాత నల్లాలను ఆఫ్‌ చేయడం లేదు. దీని వల్ల కూడా నీరు వృథాగా పోతుంది. మంచినీటిని వృథా చేయవద్దని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన కల్పించాలని, నీటి వృథా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీటిని వృథా చేస్తే జరిమానా



తాగునీరు వృథాగా పోకుండా తగు చర్యలు తీసుకుంటాం. రిక్షాపుల్లర్స్‌ కాలనీలో పర్యటించి ఆ కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తాం. నీటి వృథాపై మా దృష్టికి వచ్చింది. వెంటనే అలాంటి వారికి అవగాహన కల్పించి నీటి వృథాను అరికడతాం. మొదటిసారి హెచ్చరించినా మార్పు రాకుంటే జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటాం.

– మాధవరం రోజాదేవి, వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌.

పైపులైన్‌ పనులను పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పైపులైన్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: పైపులైన్‌ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని ఇందూ విల్లాస్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఇందూ విల్లాస్‌ వద్ద స్ట్రామ్‌ వాటర్‌కి సంబంధించిన నూతన పైపు లైన్‌ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి ఇబ్బంది ఉన్నా తనను సంప్రదించాలన్నారు. అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, రాజేష్‌, డీఈ శంకర్‌, ఏఈ సాయిప్రసాద్‌, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌ రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ వద్దు.. చేతి సంచులు ముద్దు


జ్యూట్‌ సంచులను అందజేస్తున్న లయన్‌ అన్నెం కోటి రెడ్డి తదితరులు

మోతీనగర్‌: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ జనుము, బట్ట, జ్యూట్‌తో తయారు చేసిన చేతి సంచులను ఉపయోగించాలని లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌, పర్యావరణ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్‌ అన్నెం కోటిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఎర్రగడ్డ, భరత్‌నగర్‌, స్నేహపురి కాలనీ, సనత్‌నగర్‌లతో పాటు వివిధ ప్రాంతాలలో జరిగే వారాంతపు సంతలలో ప్లాస్టిక్‌ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తూ బట్ట సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచ తీరుపతిరెడ్డి, మహ్మద్‌ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

మలేషియా టౌన్‌షిప్‌ సమస్యలు పరిష్కరిస్తా


కాలనీ వాసులతో పరిసరాలను పరిశీలిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ తదితరులు

- జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌

కూకట్‌పల్లి: మలేషియా టౌన్‌షిప్‌ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ అన్నారు. శనివారం స్థానికులతో కలిసి సమస్యలను పరిశీలించారు. మలేషియా టౌన్‌షిప్‌ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, టౌన్‌షిప్‌ పక్కనే ఉన్న పార్కులో సీనియర్‌ సిటిజన్స్‌ ప్రవేశానికి రుసుం వసూలుపై కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ గతంలో కాలనీ వాసులతో కలిసి జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులతో జోనల్‌ కమిషనర్‌ మాట్లాడారు. పార్కును పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనులను వెంటనే ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్‌ఫెయిర్‌ దోహదం


సైన్స్‌ ఫెయిర్‌లో ఎంఈఓ హరీష్‌ చందర్‌, హెచ్‌ఎం అరుణ్‌జ్యోతి తదితరులు

బాలానగర్‌: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్‌ ఫెయిర్‌లు దోహదపడతాయని బాలానగర్‌ ఎంఈఓ హరీష్‌చందర్‌ అన్నారు. శనివారం బాలానగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో అప్సా ఫౌండేషన్‌, ఆగ్నా నోబెల్‌ కంపెనీ ఆధ్వర్యంలో సైన్స్‌ ఫెయిర్‌ నిర్వహించారు. విద్యార్థులు చేసిన కొత్త ప్రయోగాలను ఉపాధ్యాయులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుణ్‌ జ్యోతి మాట్లాడుతూ నేడు సైన్స్‌ ఫెయిర్‌లో చేసిన ప్రయోగాలే రేపటికి విజ్ఞాన దీపికలుగా మారతాయని అన్నారు. కార్యక్రమంలో బసవరాజ్‌, మురళీ, లలిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్‌ లైసెన్స్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



అధికారులతో చర్చిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌ : వ్యాపారులు తమ ట్రేడ్‌ లైసెన్స్‌ల కోసం ఆన్‌లైన్‌ దరఖాస్తులు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చందానగర్‌ సర్కిల్‌–21 ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో ట్రేడ్‌ లైసెన్స్‌ విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, మీ సేవా కేంద్రాల ద్వారా పునరుద్ధరించుకోవాలని, ఇప్పటి వరకు ట్రేడ్‌ లైసెన్స్‌ పొందని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రేడ్‌ లైసెన్స్‌ 2024 డిసెంబర్‌ 31తో ముగిసిందని, కొత్తగా జనవరి 31లోపు రెన్యూవల్‌ చేసుకోలేని లేకుంటే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి, అసిస్టెంట్‌ లైసెన్స్‌ అధికారి కృష్ణ, నరేందర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, ఎస్‌ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ డైరీ ఆవిష్కరణ



ఓల్డ్‌బోయిన్‌పల్లి: బీఆర్‌ఎస్‌ నూతన సంవత్సర కేలండర్‌, డైరీని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇర్ఫాన్‌, మిరాజ్‌, బుర్రి యాదగిరి, ఖాదీర్‌, బాబా, సిరాజ్‌, నజీబ్‌ పాల్గొన్నారు.

కంటి పరీక్షల పరిశీలన


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న అజయ్‌ కుమార్‌

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిలో చేపడుతున్న కంటి పరీక్షలను వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌ డాక్టర్‌ అజయ్‌ కుమార్‌ పరిశీలించారు. శనివారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన విద్యార్థులకు చేస్తున్న ఆర్‌బీఎస్‌కె కంటి పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. చిన్నారులకు వేస్తున్న వ్యాక్సిన్లు, మందుల కొరత తదితర వివరాలపై ఆరా తీశారు. 1149 మందికి కంటి పరీక్షలు చేయాల్సి ఉండగా 419 మందికి చేశారు. మార్చి 15వ తేదీ వరకు కంటి పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ డాక్టర్‌ అనురాగిని రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

నాణ్యతలో అగ్రగామి భారతి సిమెంట్‌


బాచుపల్లిలో మేస్త్రీలతో శివకుమార్‌

నిజాంపేట్‌: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్‌ నాణ్యతలో అగ్రగామిగా కొనసాగుతుందని, అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ 5స్టార్‌ గ్రేడ్‌ తెలంగాణలో విడుదలైందని ఆ సంస్థ టెక్నికల్‌ ఇంజినీర్‌ శివకుమార్‌ అన్నారు. శుక్రవారం రాత్రి బాచుపల్లిలోని వినాయక స్టీల్‌ ట్రేడర్స్‌ డీలర్‌ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్‌ ఇంజినీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. కార్యక్రమంలో డీలర్‌ గోపాల్‌రెడ్డి, మార్కెటింగ్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ రాజేంద్రప్రసాద్‌, మేస్త్రీలు పాల్గొన్నారు.

చికెన్‌ వినియోగంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ బ్రీడర్స్‌ కో ఆర్డినేషన్‌ అసోసియేషన్‌, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్‌ అల్వాల్‌, బోయిన్‌ పల్లి, నాంపల్లి, అత్తాపూర్‌, సరూర్‌నగర్‌, హయత్‌నగర్‌, మన్సూరాబాద్‌, మొయినాబాద్‌ ప్రాంతాల్లో 'చికెన్‌–కోడిగుడ్ల మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్‌ పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ చికెన్‌ వంటకాలు, ఉడికించిన కోడి గుడ్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్‌ ఉష్ణోగ్రత వద్ద బర్డ్‌ ఫ్లూ వైరస్‌ చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది మన భారతదేశంలో 100 డిగ్రీల సెంటీగ్రేడ్‌ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని, దీనివల్ల ఏ ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

రెండో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

మియాపూర్‌: రెండో అంతస్తు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్సై మాణిక్యం వివరాల ప్రకారం...భద్రాదికొత్తగూడం ఇల్లందు గ్రామానికి చెందిన బి.రాజు(32) ఈ నెల 6న మియాపూర్‌ ఆల్విన్‌కాలనీలోని ప్రజాసిటీ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న బంధువు ఠాకూర్‌ రాజేశ్వర్‌సింగ్‌కు ఓ పార్సల్‌ ఇచ్చేందుకు వచ్చి ఆ రోజు రాజేశ్వర్‌సింగ్‌ ఇంటివద్దనే ఉండిపోయాడు. రాజుకు మద్యం తాగే అలవాటు ఉండడంతో ఆ రోజు రాత్రి మద్యం తాగాడు. అందరూ నిద్రపోయిన తర్వాత మద్యం మత్తులో రెండో అంతస్తు లోకి వెళ్లి కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయాలి



బాలానగర్‌: కాంగ్రెస్‌ పార్టీ కార్మిక విభాగం ఐఎన్‌టీయూసీ బలోపేతం కోసం కృషి చేయాలని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. సంఘం మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ నియమితులైన కాస నర్సింహ యాదవ్‌ శనివారం బండి రమేష్‌ను శనివారం కలిశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులకు చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, పుష్పరెడ్డి, సప్పిడి భాస్కర్‌, పడాల శివ నారాయణ, ప్రకాష్‌, హుస్సేన్‌, జమీర్‌, ఎండీ మోసిన్‌, ఎం. మైసయ్య, ఎండీ నయీమ్‌, ఎజాజ్‌, మోసిన్‌, ఆసిఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాసా నర్సింహయాదవ్‌

మూసాపేట: మూసాపేటకు చెందిన కాసా నర్సింహ యాదవ్‌ ఐఎన్‌టీయూసీ మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షులు కూన భరత్‌ గౌడ్‌ నియామక పత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన కార్మికులకు అందజేస్తానని నర్సింహ అన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సప్పిడి భాస్కర్‌, ఎండీ నయిం, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సమస్యల తిష్ట!

అధిక శాతం అద్దె భవనాల్లోనే నిర్వహణ

- మరోవైపు టీచర్లు, హెల్పర్లకు అందని వేతనాలు
- కూరగాయలు, గ్యాస్‌ బిల్లులు కూడా రాని వైనం
- పిల్లలు, గర్భిణులకు తప్పని ఇక్కట్లు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. ఓవైపు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌ సౌకర్యాలు లేక అల్లాడుతుంటే, మరోవైపు అధిక శాతం సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇంకోవైపు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలకు నెలనెలా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడూ కూరగాయలు, గ్యాస్‌ సిలిండర్ల బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్‌లో ఉండడంతో అప్పులు తెచ్చి కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 212 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవిగాకుండా దాతలు ఇచ్చిన మరో 138 భవనాల్లో కొన్ని కొనసాగుతుండగా, మిగిలిన 443 కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్‌ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 సెంటర్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాలకు 143 కేంద్రాలు, మేడ్చల్‌లో 211 కేంద్రాలకు 23 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి 6 నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో యాజమానుల నుంచి ఒత్తిడి భరించలేకపోతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

117 కేంద్రాల్లో నీటి కట..కట

జిల్లాలోని 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్‌ పరిధిలో అత్యధికంగా 77 కేంద్రాలు, అల్వాల్‌ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

మరుగుదొడ్లు అంతంతే..

జిల్లాలోని 118 అంగన్‌వాడీ కేంద్రాలోల కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఇందులో మేడ్చల్‌ పరిధిలో 78, అల్వాల్‌ పరిధిలో 51, కుత్బుల్లాపూర్‌ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

793 కేంద్రాల్లో 1.07 లక్షల లబ్ధిదారులు

జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 90,361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది మొత్తం 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్‌ పరిధిలోని 311 కేంద్రాల్లో 47,028 మంది, మేడ్చల్‌లోని 211 కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్‌ పరిధిలో 271 కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల భవనం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో ప్రవేశాల కోసం నిర్వహించే 'కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌–2025' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో గురుకులాలలో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతానికి ఆనుకొని ఉండే గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల, బాలుర కళాశాల(టీజీఎస్‌ఆర్‌జేసీ–బీ–నీట్‌,ప్రెప్‌ అకాడమీ)ల్లో ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ముఖ్యంగా 5వ తరగతిలో ప్రవేశాలు, అంతేకాకుండా 6,7,8,9వ తరగతుల్లో ప్రస్తుతం ఖాళీ ఉండే సీట్ల కోసం కూడా పరీక్షను ఒకేసారి నిర్వహించడంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఫోన్‌ ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వివరాలను కూడా అధికారులు, ఉద్యోగులు అందించారు. పరీక్షా కేంద్రంలో సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. పరీక్షా సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.